# ప్రేమ నవ్వింది

రచన:
శ్రీ. కలగర్ల నరసింహామూర్తి

త్రన అదృష్టానికి మల్లే. పొయ్యికూడా మండకుండా, తనను దుఃఖపెడుతోంది. పొగ చూరుకొని, కమల కళ్ళు మండి పోతున్నాయ్. అయినా, అందులో పొయ్యి తప్పేముంది? పచ్చిక కట్టెలు పెడితే, పొయ్యి ఎలా మండుతుంది? అయినా తప్పదు. పొయ్యి మండాలి వేళకు వంట కావాలి, వేళకు వంటై, భోజనం సిద్ధం కాకపోతే, సవతి తల్లి క్షమించదు. బి. ఏ. పాసై, విధి లేక, చెయ్యడానికి వెంటనే ఉద్యోగం దొరక్క, వంటింట్లో పొగతో నిండిపోయిన, పొయ్యిముందు కూర్చొని ఊదుతు, ఉక్కిరి బిక్కిరవుతోంది, కాలేజీలో బ్యూటీక్వీన్, అని పేరు పొందిన కమల.

హాల్లో కూర్చున్న సవతి తల్లి "కమలా, ఒక్కసారీ ఇలారా' అని పిలిచింది. పిలుపు విని పరిగెత్తుకొని హాల్లోకి వచ్చింది కమల. తొందరగా చెమ్మగిల్లిన కళ్లను, జిడ్డుపట్టిన ముఖాన్ని, చీర చెంగుతో తుడుచుకుంది కమల.

'చూడమ్మా! రేపు నువ్వు వెళ్ళి, మిస్టర్ కపూర్ గార్ని కలుసుకో అన్ని ఏర్పాట్లూ నేను చేసాను. ఆయన, నీ చదువు మిగతా విషయాలువిని, నీకు తప్పకుండా ఉద్యోగం ఇస్తానన్నారు. పైగా, ఆయన ఎంతో మంచి వారు. తన కంపెనీలోని ఉద్యోగస్థులకు, మాంచి జీతం, బోనస్‌లు ఇస్తున్నారు' అంది సవతి తల్లి. కమల సంతోషంతో 'సరే పిన్నీ! తప్పకుండా వెళ్తాను' అంది.

సవతి తల్లి, తన గురించి అంత శ్రద్ధ ఎందుకు తీసుకుందో. ఎందుకంత ప్రసన్నంగా మాట్లాడిందో కమలకు తెలుసు. తన సవతి తల్లికి డబ్బంటే గొప్ప ఆపేక్ష. అందులోనూ కష్టం ఒకరిదై, డబ్బు తనదైతే, మరీ సంతోషం.

ఆ మర్నాడు వెళ్ళి కమల కపూర్ గార్ని కలుసుకుంది. ఆయన వయస్సు యాభై పైనే ఉంటుంది. పూర్తి బట్టతల నల్లని సూట్ వేసుకొని, ఖరీదైన కంపెనీ చుట్టల్ని కాలుస్తున్నాడాయన. కమలను ఏవేవో ప్రశ్నలు వేసిం తర్వాత, ఆయన స్విచ్చిని నొక్కాడు. వెంటనే వెనక నున్న తలుపు తెరుచుకుంది.

ఆ గదిలోనుండి ఒక అందమైన యువకుడు వచ్చి, కపూర్ గారి ఎదురుగా నిలబడ్డాడు. కమల ఆయువకుణ్ణి చూసింది. ఆ ఒక్క చూపుతోనే, కమలకు ఆ యువకుడంటే ఎంతో ఇష్టం కలిగింది. ఆ యువకుడు కూడా ఎటో చూస్తున్నట్టు చూసి, ఒక్కసారి కమలను చూసి తిరిగి చూపులు మరల్చుకున్నాడు.

కపూర్ గారు, కమలవంక ఎంతో ఆప్యాయంగా చూసి 'చూడమ్మా కమలా!' వీడు మా అబ్బాయ్ దిలీప్' అన్నాడు.

'గ్లాడ్ టు మీట్ యూ' అంటూ తన చేతిని ముందుకు చాచింది కమలం 'సేమ్, విత్ మీటూ' అంటూ నవ్వి, దిలీప్ కూడా, తన చేతిని చాచి, ఆమెతో కరచలనం చేసాడు. ఆ స్పర్శతో, ఆ ఇద్దరి హృదయాలు, ఏదో మధుర బాధతో, ఒక్కసారి జల్లుమన్నాయ్.

నిర్ణయించిన ప్రకారం, ఆ మర్నాడే కమల, కపూర్ గారి పెర్సనల్ సెక్రటరీగా, ఉద్యోగంలోనికి ప్రవేశించింది. అందుకు తగ్గయోగ్యత ఆమెలో కనిపించింది. కపూర్ గారి పైగా చెయ్యవలసిన పని కూడా, ఏమంత కష్టంగాలేదు. మాంచి ఉత్సాహంగా, హాయిగా ఉంది ఆఫీసులోను పని. కమలతోబాటు ఆ ఆఫీసులో 'రోజ్' అనే పద్దెనిమిదేళ్ళ ఇంకో అమ్మాయ్ కూడా, టెలిఫోన్ ఆపరేటర్ గా పనిచేస్తోంది, సుంద్రని, నల్లని కళ్ళు, నల్లని ఎత్తైయిన బాబ్డ్ హెయిర్ గల 'రోజ్' ఎంతో అందంగా కనిపించింది. కమలకు అతి త్వరలో కమల, రోజ్ ప్రాణస్నేహితులై పోయారు. ఇద్దరూ కలసి, సెలవు దినాల్లో, టెన్నిస్ కోర్టుకు, స్విమింగ్ పూల్‌కు వెళ్ళి కాలక్షేపం చేసేవారు.

మొదటినుండీ కమలకు తన సవతితల్లి సుభద్రఅంటే పరమ ఏవగింపు. కమలకు ఇరవై ఏళ్ళ వయస్సుంటే, సుభద్రకు దరిదాపున నలభై ఏళ్ళుంటాయ్ పైగా. అంత వయస్సులో కూడా సుభద్ర ఎంతో అందంగా ఉండేది. కమల అందం, మధురమైన ఊహలు లేపితే, సుభద్ర అందం, అయస్కాంతంగా ఆకర్షించుకోగలదు. ఎదుటి వ్యక్తిని కమల, సుభద్రను అసహ్యించుకోడానికి, సుభద్ర అందంగా ఉందన్న ఈర్ష్యకూడా ఒక కారణం, పైగా కమలయొక్క తండ్రి మరణించిన నాటినుండీ, కమలను సుభద్ర చాలా కష్టాలు పెట్టింది.

కానీ, ఈనాడు మాత్రం కమల, తొలిసారిగా, తన సవతి తల్లిని మనసులో మెచ్చుకుంది. ఎందుకంటే, తను ఈనాడు ఇంతమంచి ఆఫీసులో ఉద్యోగాన్ని, రోజ్ లాంటి మిత్రురాల్ని పొందగలగడానికి కారణం? తన సవతి తల్లే. అంతకు పూర్వం, కమల చాలాకాలం స్నేహితులు లేకుండా గడిపింది. అందువల్లనే కమల, తన సవతితల్లిని మెచ్చుకుంది.

రోజ్, ఎన్నో తీయని, ఉత్సాహకరమైన కబుర్లు చెబుతోండేది. పైగా రోజ్, చాలా హుషారైన పిల్ల. పోతే, కొన్నాళ్ళకు, కమలకు ఒక విషయం బోధపడింది. రోజ్, తన సంభాషణలో, కమల సౌందర్యం గురించి ప్రతీసారి గొప్పగా పొగిడేది.

ఒకనాడు స్విమింగ్ పూల్ (ఈతకొట్టే చిన్నకొలను) దగ్గర కమల రోజ్‌ను చూసి 'ఏం రోజ్! అలా అవోలా విచారంగా ఉన్నావ్? నాతో చెప్పకూడదా!' అంది.

వెంటనే రోజ్ పకాలున నవ్వి 'అదేవిటి? నేను ఇడారంగా ఉన్నట్టు కనిపిస్తున్నానా, ఏం! అది సరే గానీ, నాకేం విచారం లేదు, పదపద ఈత కొడదాం!' అంటూ పూల్‌లోనికి దూకింది రోజ్. ఆ వెనకాలే కమలకూడా దూకింది.

దూకీ, దూకడంతోనే పూల్‌లోని నీటిపై భాగం, చల్లగా జివ్వుమని తగిలింది కమలకు. వెంటనే, నీటిఅడుగున, ఈత కొట్టడానికి వెళ్ళింది కమల. అలా నీటి అడుగున ఈదుతుంటే, ఆమెకు నీటిపైన ఈదుతున్నవారి కాళ్ళు మాత్రమే కనిపిస్తున్నాయ్. రోజ్ ఎక్కడుందో అని వెదుకుతోంది కమల. కానీ రోజ్ కనిపించలేదు. వెంటనే నీటి ఉపరిభాగానికి వచ్చి చూసింది కమల. రోజ్, అవతలి ఒడ్డున ఈదుతూ, 'టాటా' అని నవ్వుతూ కమలను వెక్కిరించింది. వెంటనే కమల నీటిలోనికి పోయి, ఈదుతూ రోజ్‌ను సమీపించబోయింది. ఇంతలో ఎవరో, ఆ నీటిలోనే గభాలున కాలుపట్టి కమలను లాగేసారు. మరుక్షణంలోనే, ఆమె చుట్టూ ఏవో బలమైన చేతులు చుట్టుకున్నాయ్. ఆమె మృదువైన ...... ఏదో తల, తడిమింది. మరోక్షణంలో, ఆమె పెదిమలమీద, ఎవరివో మెత్తని పెదిమలు గట్టిగా ముద్రవేసినాయి. కమల ఉక్కిరి బిక్కిరై, తననుబంధించిన హస్తాలను విడిపించుకొని, తనను అలా కౌగలించుకొని, ముద్దుపెట్టుకున్నది ఎవరా అని చూడబోయింది. కానీ అప్పటికే ఆ వ్యక్తి తప్పించుకొని వెళ్ళిపోయాడు. ఇక ఆమెకు కనిపిస్తున్న ఎల్లా ఎన్నో ఈదుతున్న కాళ్ళ జతులు మాత్రమే. మెల్లగా నిట్టూర్పు విడిచి కమల ఈదుకుంటూ రోజ్ దగ్గరకు వెళ్ళిపోయింది. కానీ జరిగిన సంగతి రోజ్‌తో చెప్పలేదు.

ఆ రాత్రి కమల, మంచంమీద పడుకుందే గానీ, నిద్రపట్టలేదు. ఉదయం, పూల్‌లో జరిగిన సంగతిని పదేపదే నెమరువేసుకుంది. ఆ వ్యక్తి ఎవరోగానీ, తన పెదిమల్ని,...............అలా తీయగా తాకి, కౌగలించుకొని, ముద్దులాడుతుంటే...తలచుకొని కమల తీయని తలపులతో సిగ్గుపడింది. నిజంగా అవన్నీ జరిగినప్పుడు కమలకు కోపం వచ్చింది, కానీ ఆ చల్లని రాత్రి వేళ, ఆ ఏకాంతంలో, ఆ తీయని ముద్దుకోసం, కమల తహతహలాడిపోయింది.

ఆ మర్నాడు ఆఫీసులో పని చేసుకుంటూ, కమల ఎందుకో తన బాస్ గదిలోనికి వెళ్ళి చూసి, ఆ సీట్లో, తన బాస్ కపూర్‌కు బదులు, అతని కుమారుడు దిలీప్ కూర్చొని ఉండటం చూసి ఆశ్చర్యపోయింది. తిరిగి తన సీట్లోనికి వెళ్ళిపోయి, పనిచేసుకోనారంభించింది కమల

టంగు టంగున గడియారం, ఏడు గంటలు కొట్టింది. అప్పటికి బాగా చీకటిపడింది. ఆఫీసులో కమల తప్ప మిగతా స్టాఫ్ అంతా వెళ్లిపోయారు. ఆనాడు కమలకు ఊపిరి పీల్చడానికికూడా వీలులేనంతపని వచ్చిపడింది. వంద వోల్టుల బల్బు, గదిలో దేదీప్యమానంగా వెలుగుతోంది. కమల, విసుగుతో, ఫైళ్లను పక్కకు నెట్టి, కిటికీ గ్లాస్ డోర్ తెరచింది. చల్లని గాలి, రివ్వున గదిలోనికి ప్రవేశించింది. ఆమె ప్రాణం హాయిమంది. ఆకాశంలో చంద్రుడు నిండుగా ప్రకాశిస్తున్నాడు.

బహుత్ షుకిరియా, బడీ మెహరుబానీ
మేరీ జిందగీమే, హుజుర్ ఆవ్ అయి
కధమ్ ఘూములూయా, ఏ ఆంఖే బిచాహూమై,
మేరీ జిందగీమే, హుజూర్ ఆవ్ అయి.

మెల్లమెల్లగా, సన్నసన్నగా, ఆ పాట ఎంతో తీయగా సోకింది, కమల చెవులకు. ఆ పాట, పాడుతున్నదెవరోగానీ, అచ్చరఫీలాగే పాడుతున్నారు. ఎవరు

(తరువాయి 23వ పేజీలో)